# జ్ఞాతమూ - అజ్ఞాతమూ

హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్, కార్డియాలజీ విభాగం ఇంటెన్సివ్ కేర్ యూనిట్ కారిడార్‌లో, అసాయంత్రం మూగిన మనుష్యుల ముఖాల్లో విషాదం, ఆందోళనా.....

లోపల గదిలో మృత్యువుతో పోరాడుతున్న రాఘవ.....

అతని బెడ్ పక్క ఇద్దరు డాక్టర్లూ, ఒక నర్సూ, అతని భార్య వరలక్ష్మి, కొడుకూ, కూతురూ, మిత్రుడు మాధవమూర్తీ......

గదంతా చాలా నిశ్శబ్దంగా ఉంది.

దుఃఖాన్నీ, ఏడుపుల్నీ బలవంతంగా బిగపట్టినట్టు వాతావరణం టెన్షన్‌తో బిర్రబిగుసుకుంది. మధ్యాన్నం నుంచీ స్పృహలో లేడు అతను.....

☆ ☆ ☆

ఆరోజు ఉదయం ఇంటినుండి పెళ్లిపనుల మీద బయలుదేరాడు రాఘవ.

పెళ్లి ఇంకా నాలుగు రోజులు మాత్రమే ఉంది.

పెళ్లి పనులన్నీ తన ఒక్కడి నెత్తిమీద వేసుకొని నెల రోజులుగా నానాయాతనా పడతున్నాడతను.

పెళ్లి అతని కుమార్తె సరళది.

రాఘవకు ఇద్దరు సంతానం. ఒక కొడుకూ, కూతురూ. కొడుకు మహీ ఇంటర్ చదువుతున్నాడు. కూతురు సరళ – ఆ అమ్మాయి వయసు ఇరవై మూడు దాటుతోంది. డిగ్రీపూర్తి చేసి రెండేళ్లయింది. ఈ రెండేళ్లు సరళకు ఉద్యోగ ప్రయత్నాలు ఒకవేపు చేస్తూనే, మరోవేపు సంబంధాలు విచారిస్తున్నాడు రాఘవ.

పెళ్లి సంబంధాలు వెదకటంలో బొత్తిగా అనుభవం లేదు రాఘవకు. అంతకు మునుపు ఎవరికీ సంబంధాలు కుదిర్చిన వాడు కాకపోయె! ఎవరైనా మిత్రుల దగ్గర ప్రస్తావన తెచ్చినప్పుడు "నువ్వెంతలో ఉన్నావు" అని అడిగితే విస్తుపోయేవాడు. "ఎంతలో ఉన్నావు" అంటే "కట్నం ఎంత ఇవ్వగలవు" అని అర్థమట! పెళ్లి కుమారులను చూడకమునుపే 'తాను ఎంత ధర పెట్టగలడో' చెప్పమంటూంటే ఆశ్చర్యం వేసేది అతనికి.

తనకు తెలిసినంతవరకూ పెళ్లిచూపులు జరిగిన తర్వాత అన్నివిషయాలూ నచ్చితే, కట్నకానుకలు మాట్లాడుకోవటం రివాజు! ఇప్పుడు చూస్తే ఆ పద్ధతి తల కిందులయినట్టనిపించిందతనికి. ఒక మిత్రుడు అతనితో ఏమన్నాడంటే, "చూడు రాఘవా! పెళ్లిచూపులకు ఎవరో ఒకర్ని అహ్వానించడమూ, వాళ్లింటికి మీరూ మీ ఇంటికి వాళ్లూ వచ్చిపోవటమూ, అన్నీ నచ్చిన తర్వాత కట్నకానుకలూ మాట్లాడుకోవటమూ, కట్నం నచ్చకపోతే సంబంధం తప్పిపోవటమూ, ఎంతో కొంత బాధపడటమూ – ఈ పద్ధతి ఇప్పుడే విధంగానూ మంచిదికాదు... అందుకనే ముందుగానే నువ్వెంత ఇవ్వగలవో నిర్ణయించుకొని, ఆస్థాయికి తగ్గ వరుణ్ణి వెతకటం మంచిది. నువ్వెంత ఇవ్వగలవో వాళ్లకు ముందుగానే తెలిస్తే, ఆ ధర వాళ్లకు నచ్చితే, నీ యింటికి రావటం, చూడటం, సరియైన పద్ధతి! అది మంచిగానీ, చెడుగానీ, ఈ పద్ధతివల్ల కొన్ని సమస్యలు తప్పిపోతాయి. కాబట్టి ఎంత 'రేటు' పెట్టగలవో ముందే ఒక నిర్ణయానికి రా" అంటూ హితబోధ చేశాడు. ఈ పద్ధతి బాగానే ఉందనిపించినా, మరీ ఇంత ఫక్తు వ్యాపారంగా పెళ్లి సంబంధాలు కుదరటం ఎబ్బెట్టు అనిపించింది రాఘవకు.

"కట్నం ఇస్తేతప్ప ఆడపిల్లలకు పెళ్లిళ్లు కావు" అన్న సంగతి తెలియని అమాయకుడేం కాదు రాఘవ. ఇరవై మూడేళ్ల క్రితం తనకు ఆడపిల్ల పుట్టినప్పుడు, ఆపిల్లకు పెళ్లీడు వచ్చేటప్పటికి సామాజిక మూలాల్లోనే ఏదో పెద్దమార్పు వస్తుందనీ, కట్నాలూ గిట్నాలూ లేని వివాహవ్యవస్థ ఏర్పడుతుందనీ, బోలెడు ఆశాభావంతో, నిజం చెప్పాలంటే ఎంతో దురభిప్రాయంతో రాఘవ ఉన్నమాట వాస్తవం!

గత పదేళ్లలోనూ కట్నాలరేట్లు పెరిగిపోవటానికి గల కారణాలు రాఘవకు ప్రత్యక్షంగానే కనిపిస్తున్నాయి. మార్కెట్ లో విపరీతంగా వచ్చిపడుతున్న వస్తుసంచయం పట్ల యువత ఆకర్షణకు లోనుకావటం తాను గుర్తిస్తున్నదే! నేటి యువతను, తమకంటే ఆర్థికంగా ఉన్నతమైన ఒకవర్గం యొక్క జీవితం ప్రలోభపెట్టటం, ఆ వర్గం సంస్కృతీ విలాసాలు తామూ అనుభవించాలని కోరుకోవటం క్రమంగా వచ్చిన ఒక భయంకర పరిణామం అని అతనికి తెలియక పోలేదు... టీవీలూ, సోఫాసెట్లూ, ఏర్ కూలర్లూ, ఫ్రిజ్ లూ, స్వశక్తితో తీర్చుకోలేని యువతకు, సులభంగా పరిష్కరించే ఏకైక మార్గం కట్నం! అయితే దీనికి బలి అవుతున్నది ఆడపిల్లల తండ్రులు! ఈ స్పృహ రాఘవకుంది... సాంఘిక క్రౌర్యాలన్నిటికీ మూలం మనుషులు తమ అవసరాలను పరిమితం చేసుకోలేక పోవటం వల్లనేమో" అనుకొని నిట్టూర్చాడు రాఘవ.

"ఇప్పటి యువకుడు తన కట్నాన్ని తానే నిర్ణయించుకుంటున్నాడు. తల్లిదండ్రులు నిర్ణయించే కాలం చెల్లిపోతూ ఉంది. తన అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిస్సిగ్గుగా తనరేటును చెప్పుకుంటున్నాడు. తనకు పెళ్ళయి కాపురం పెట్టేనాటికే సకల సంపన్న సౌకర్యాలు అమరాలని కోరుకుంటున్నాడు నేటి పెళ్లికొడుకు..."బివేర్ ఆఫ్ బ్రైడ్‌గ్రూమ్" అంటూ హెచ్చరించాడో మిత్రుడు రాఘవతో సీరియస్‌గానే!....

....రాఘవ 'బస్‌స్టాప్'కు వచ్చేసరికి అప్పుడప్పుడే ఒక 'టౌన్‌సర్వీస్' దూరంగా వెళ్తూ కనిపించింది. "మరో పదినిమిషాలైనా వెయిట్ చేయక తప్పదు" అనుకుంటూ 'స్టాప్'లో సిమెంటుబల్ల మీద కూర్చున్నాడు. తొమ్మిది దాటకపోయినా వైశాఖమాసం కావటంతో ఎండ మండిపోతూ ఉంది. పాంటు జేబులోంచి చేతిగుడ్డ తీసి ముఖం తుడుచుకున్నాడు రాఘవ...

రాఘవకు ఈ పెళ్లి సంబంధం కుదిర్చింది అతని బాల్యమిత్రుడు మాధవమూర్తి. రాఘవదీ మాధవదీ ఒకే ఊరు – చిన్నప్పట్నుంచీ కలసి చదువుకున్నారు. ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. తన్ను 'ఒరేయ్' అని పిలిచే మాధవ అంటే చాలా ఇష్టం రాఘవకు. మాధవ స్నేహితుడొకడు సమీపంలో ఉన్న టౌన్‌లో రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆ స్నేహితుడికి ఒక అబ్బాయీ, అమ్మాయీ.

ఆ సంబంధం గురించి రాఘవతో ప్రస్తావిస్తూ, "అమ్మాయి పెళ్లయి నాలుగేళ్ళయిందట – అబ్బాయి కర్నూల్‌లో బాంక్‌లో పనిచేస్తున్నాడు. జీతం మూడువేల పైగా వస్తుందట. ఒకటిన్నర లక్ష వరకూ ఇవ్వాల్సి ఉంటుంది" అంటూ వివరాలు అందచేశాడు మాధవ –

"లక్షన్నర నగదుతోపాటు పదితులాలు బంగారం కూడా" చేర్చాడు మాధవ ముక్తాయింపుగా.

లక్షన్నర అనేసరికి పూర్తిగా వెనకడుగు వేశాడు రాఘవ. "మన చాతనయ్యే పనికాదు" అనుకున్నాడు. ఒక నెలకల్లా ఆ విషయం పూర్తిగా మరిచిపోయాడు కూడా. నెల తర్వాత మళ్లీ హెచ్చరించాడు మాధవ...

"చాలా మంచి సంబంధం రాఘవా! ఉద్యోగం చేస్తూ మూడువేలు సంపాదిస్తూ, అంతోయింతో ఆస్తిపాస్తులున్న అబ్బాయికి లక్షన్నర యివ్వటానికి వెనకాడకూడని కాలం ఇది; అదీ మీకులంలో! అబ్బాయి ఎక్కడో దూరంగా పని చేస్తున్నాడు. అత్తా ఆడబిడ్డల పోరు ఉండదు. అమ్మాయి సుఖపడుతుంది" అన్నాడు.

రాఘవ ఆలోచనల్లో పడిపోయాడు! ఆరోజు రాత్రే ఆ విషయం తన భార్య దగ్గర ప్రస్తావించాడు. "మాధవ చెప్పింది బాగానే ఉంది. ఎటొచ్చీ మనం అంత మొత్తం ఎలా సర్దగలం" అన్నాడు. ఇద్దరూ ఆ సంబంధం గురించి సుదీర్ఘంగా చర్చించుకున్నారు. తమ దగ్గర నిల్వ ఉన్న డబ్బును బేరీజు వేసుకున్నారు – కూతురు పేరున పోస్టాఫీస్‌లో నెలకు ఐదువందల చొప్పున వేసిన 'రికరింగ్ డిపాజిట్' తాలూకు మొత్తం నలభైవేలు మాత్రమే నగదుగా ఇప్పుడు తమ దగ్గర

వుంది. తాను ఐదేళ్లక్రితం డిప్ పద్ధతిలో కొన్న ఐదు సెంట్ల ప్లాటు ఇప్పుడు అమ్మకానికి పెడితే అరవైవేలదాకా రావచ్చు. 'ప్రావిడెంటు ఫండ్' నుండీ 'పార్ట్ ఫైనల్ విత్ డ్రాయల్' ద్వారా పదివేలు పొందవచ్చు. ప్రస్తుతం తాను కడుతున్న ఒక 'చిట్' ను మధ్యంతరంగా ఎత్తి పదివేల దాకా తీసుకోవచ్చు. అంతా కలిపితే లక్షా ఇరవైవేల దాకా కావచ్చు! లక్షన్నర కట్నంతోపాటు పెళ్లి ఖర్చు ముప్ఫయివేలైనా అవుతుంది. అంటే అదనంగా యాభైవేలకు పైగా అప్పు, చేయాల్సి ఉంటుంది. మాధవ ఒక పదివేల దాకా సర్దినా మరో నలభైవేలు ఎవర్ని అడగాలి? రాత్రి బాగా పొద్దు పోయేదాకా ఈ గణాంక వివరాలు తయారుచేయటంలో మునిగిపోయారు భార్యాభర్తలు. "ఎవరైనా అప్పులు చేయకుండా బిడ్డల పెళ్లిళ్లు ఎలా చేస్తారండీ? ఎలాగో ఓలా చూద్దాం. ముందు సంబంధం చూసి రండి" అంటూ రాఘవకు ధైర్యం చెప్పింది వరలక్ష్మి.

మరుసటిరోజు మాధవతో కలిసి వియ్యంకుల ఊరికి వెళ్లివచ్చాడు రాఘవ. మరో పదిరోజుల తర్వాత అబ్బాయిని కర్నూల్ నుండి పిలిపించి పెళ్ళి చూపులకు వచ్చారు వియ్యంకులు. అమ్మాయి నచ్చింది వాళ్లకు. ముందు అనుకున్న విధంగానే పెట్టుపోతలు ఖరారయ్యాయి. రాఘవ ఉంటున్న ఊళ్లోనే ఒక కళ్యాణ మండపంలో వివాహం జరిగేట్టు నిశ్చయం జరిగింది. మరో పదిరోజుల తర్వాత నిశ్చితార్థానికి వస్తామన్నారు. నిశ్చితార్థానికి యాభైమంది దాకా వస్తామన్నారు వాళ్లు. ఫోటోలు తీయించాలన్నారు. మంచి దండలు తెప్పించాలన్నారు. పెళ్ళికూతురుకు ఒక పట్టుచీరా, ఉంగరమూ తెస్తామన్నారు. పెళ్ళికొడుక్కు మంచి దుస్తులూ, ఉంగరమూ పెట్టాలన్నారు. ఇది పద్ధతి అన్నారు. ఆశ్చర్యపోయాడు రాఘవ. నిశ్చితార్థం అంటే పెళ్లిఒప్పందం కుదుర్చుకోవటం. ఈ పనికి ఇంత మందీ మార్బలం అవసరమా? నిశ్చితార్థం కూడా చిన్నపెళ్లిలా జరగాల్సిందేనా? ఈ మాటే మాధవతో అంటే "ఈ నాలుగైదేళ్లుగా మన ప్రాంతంలో కూడా ఈ కొత్త వేడుక అలవాటయింది రాఘవా! మన పైతరగతిని చూసి పెట్టుకుంటున్న వాత ఇది. నిశ్చితార్థానికి కూడా బంధువుల్ని ఆహ్వానించటమూ, పెద్ద విందు ఇవ్వటమూ, ఉంగరాలు మార్చుకోవటమూ, ఫోటోలు వీడియోలూ తీయించటమూ, ఇదొక 'కల్చర్'గా మారిపోయిందిప్పుడు. తమ సాంఘిక స్థాయిని ప్రదర్శించుకొనేందుకు మగపెళ్లివారికి ఇది తొలిమెట్టు – భరించక తప్పదు" అన్నాడు మాధవ. రాఘవ తల ఊపక తప్పలేదు.

నిశ్చితార్థం జరిగిన తర్వాత, నాలుగువారాలకు పెళ్లి. నిశ్చితార్థం రోజునే లగ్నపత్రికలు రాసుకున్నారు. పెళ్లికి రెండు వారాలముందే కట్నం డబ్బునంతా ఇచ్చివేయాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. "తీరా పెళ్లిరోజుకు మీరు సర్దలేకపోతే, పెళ్లిపందిట్లో, రసాభాస చేయటం, మాకూ మీకూ కూడా మంచిది కాదు. డబ్బు కారణంగా మీకూ మాకూ సంబంధాలూ చెడకూడదు. 'ముందే ఇవ్వటం హుందాగా ఉంటుంది.' అన్నారు వియ్యంకులు, రాఘవ అంగీకరించాడు – మనసులో కొంత చికాకు అనుభవిస్తూనే! పెళ్లికి తమ తరపున నాలుగు వందల మంది పైగా, వస్తామనీ, ఏర్పాట్లు తమస్థాయికి తగ్గట్టుగా ఉండాలనీ సూచించారు. పెళ్లినాడు

వీడియోఖర్చు ఆడపెళ్లివాళ్లే భరించాలనీ, తమకో కాసెట్ యివ్వాలనీ అడిగారు. వివాహకార్యక్రమం మొత్తం, ఒక వ్యాపారానికి సంబంధించిన లావాదేవీ లాగా జరుగుతున్నందుకు మనసులో అయిష్టంగా ఉన్నా భరించక తప్పలేదు రాఘవకు.

లగ్నపత్రికలు రాసుకున్నప్పటి నుంచీ చాలా హడావుడిలో పడిపోయాడు రాఘవ. ఆఫీసుకు ఒక నెల రోజుల పాటు సెలవు పెట్టాడు. డబ్బు విషయమై తన పరిస్థితినంతా మాధవతో ముందే చెప్పాడు రాఘవ. ఒకరి పరిస్థితులు ఒకరికి తెలుసు, మాధవ తనో పదివేలు సర్దుతానన్నాడు. ఒక ఫైనాన్స్ కార్పొరేషన్‌లో మూడు రూపాయిల వడ్డీతో ఇరవై వేలు పుట్టించాడు. ఒక మిత్రుని దగ్గర రెండు రూపాయిల వడ్డీతో ఇరవై వేలు ఇప్పించాడు. రాఘవ పేరనున్న ఐదు సెంట్ల ప్లాట్‌ను ఒక బ్రోకర్ ద్వారా అరవై ఐదు వేలకు కుదిర్చి అమ్మించాడు. ఇలా డబ్బు సమకూర్చుకోవటానికి రెండు వారాలు పట్టింది.

అమ్మాయికి పెట్టాల్సిన పది తులాల బంగారం మాత్రం కొనాల్సిన అవసరం లేకుండా పోయింది. రాఘవ భార్యకు వాళ్ల పుట్టింటివాళ్లిచ్చిన ఐదుతులాల గొలుసుతో పాటు తను చేయించిన గాజులు కూడా వుండటంతో ఆ సమస్య తీరిపోయింది.

పెళ్ళి పనులకు పూనుకున్నప్పటి నుంచీ రాఘవ ప్రతి చిన్న విషయానికి ఎంతో టెన్షన్ ఫీలవుతున్నాడు. ఏ చిన్న లోపమూ జరగకుండా పెళ్లి ఎంతో, సవ్యంగా జరగాలని శ్రద్ధతో స్వయంగా అన్ని పనులూ తనే నెత్తిన వేసుకున్నాడు. పెళ్లికి పదిరోజులు ముందుగా కట్నం బాపతు సొమ్ము మాధవ ద్వారా వియ్యంకులకు అందించాడు. వియ్యంకులు కూడా ఎంతో మర్యాదగా వ్యవహరించి చిన్న చిన్న పనులలో రాఘవకు సహకరించారు కూడా –

పెళ్లి ఖర్చులు అనుకున్నదానికంటె ఎక్కువయ్యాయి. బియ్యమూ, బేడలూ, నూనెలూ ఒక్కటేమిటి అన్నింటి ధరలూ ఆ రెండు నెలల్లోనే విపరీతంగా పెరిగిపోవటంతో ఖర్చులు బాగా పెరిగిపోయాయి. పెళ్లిబట్టలూ, కళ్యాణ మండపం ఖర్చులూ, వంట సామాగ్రీ ఇలా అన్నింటికీ ముప్పైవేలకు పైగానే ఖర్చులు వచ్చాయి. మరో పది వేల దాకా ఖర్చు రావచ్చు.

పెళ్లి పత్రికలు అచ్చువేయించిన తర్వాత ఇంటిల్లపాది కూచుని అడ్రసులు రాశారు. చాలామంది మిత్రులకూ, బంధువులకూ స్వయంగా ఇచ్చి ఆహ్వానించాడు రాఘవ. రోజూ ఏడెనిమిది గంటలు పెళ్లిపనుల మీదే తిరగటం వల్ల ఈనెల రోజుల్లో బాగా అలసిపోయి సగం చిక్కిపోయాడు రాఘవ.

పెళ్లి పనులన్నీ దాదాపు పూర్తిగావచ్చాయి. పెళ్లి ఇక నాలుగు రోజులు మాత్రమే వుంది. ముందు అనుకున్న పురోహితుడు జబ్బు పడటంతో కొత్త పురోహితుణ్ణి మాట్లాడటానికి, ఆ రోజు ఉదయం ఇంటి నుండి బయలుదేరాడు రాఘవ. పురోహితుని ఇల్లు తపోనగర్‌లో వుంది. ఆటోలో వెళ్తే పది రూపాయిలకు పైగా అవుతుందని టౌన్ సర్వీస్‌కోసం ఎదురుచూస్తూ కూచున్నాడు స్టాండ్‌లో.

తొమ్మిది దాటింది.

ఎండ బాగా చుర్రుమంటోంది.

ఎదురెండ కావటంవల్ల రాఘవ ముఖం మీద చమటలు విపరీతంగా ప్రవిస్తున్నాయి. పొద్దున ఇంట్లో బయలుదేరేటప్పుడు రెండంటే రెండే ఇడ్లీలు తిని, కప్పు కాఫీ తాగాడు. అంతే! ఇప్పుడు కడుపులో ఆకలిలాంటిది లేదు కాని, ఏదో వికారం లాంటిది ప్రారంభమైంది రాఘవకు. గుండెల్లో ఏదో పైకి ఎగదన్నుతున్నట్టు, ఛాతీ మధ్య భాగంలో ఎవరో చేయిపెట్టి మెలి తిప్పుతున్నట్టు అకస్మాత్తుగా నొప్పి, క్రమంగా, ఆ నొప్పి ఎడమ చేతిలోకి ప్రాకి వేళ్ల ధాకా విస్తరిస్తున్న 'ఫీలింగ్' – 'ఏమిటీ బాధ' అనుకుంటూ రాఘవ కూర్చున్న చోటు నుంచీ లేచి బాగా నీడగా వున్న చోటుకు వెళ్దామని ప్రయత్నం చేయబోయాడు. లేచి నిలబడగానే కళ్ల ముందు అంతా మసకమసకగా, పచ్చపచ్చగా అస్పష్టపు తెరలు – ఉన్నట్టుండి ఒళ్ళంతా చెమటల ప్రవాహం. రాఘవ అడుగు ముందుకు వేయలేకపోయాడు. నొప్పి బాగా అదిమి పట్టి తన్ని కిందికి లాగుతున్నట్టు అనిపించి, ఛాతీని బలంగా చేతితో తడుముకుంటూ, నిల్చున్నవాడు నిల్చునట్టే కుప్పకూలిపోయాడు.

☆ ☆ ☆

ఆ రోజు ఉదయం

సిద్ధార్థ కళ్యాణ మండపం పెళ్ళివారితో కలకల లాడుతోంది –

సన్నాయి మేళం మందస్వరంతో వీనుల విందుగా వినిపిస్తోంది.

మగపెళ్ళివారు అంతకు మునుపు రాత్రి తొమ్మిది గంటలకల్లా మూడు క్రిక్కిరిసిన బస్సుల్లో కళ్యాణమండపం ముందు దిగారు. పెళ్ళి కొడుకు తండ్రి బస్సు దిగగానే రాఘవ ఆరోగ్యం గురించి మాధవను విచారించాడు. ఆయనకు అంతకు రెండు రోజులముందే తెలిసింది రాఘవ గుండెపోటుతో హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాడని.

"హాస్పిటల్లో వున్నాడు రాఘవ. కదిలించవద్దని డాక్టర్లు చెప్పటంతో బెడ్ మీదే వున్నాడు. మన స్పృహలో లేడు. నాలుగైదు రోజుల్లో బాగా కుదుటపడుతుందని డాక్టర్లు చెప్పారు. కంగారు పడాల్సిందేమీ లేదు. ఎటొచ్చీ తాను స్వయంగా, కళ్యాణ వేదిక మీద వుండి బిడ్డ పెళ్లి జరిపించలేని స్థితిలో వున్నాడు. ఎవరూ వచ్చి డిస్టర్బ్ చేయొద్దని డాక్టర్ల సలహా" అన్నాడు మాధవ విచారంగా ఆయనతో.

వచ్చిన బంధువులంతా 'అయ్యో పాపం' అని విచారించారు. ఈ శుభకార్యం జరిగిపోతే అదే పదివేలు అనుకున్నారు.

ఏర్పాట్లన్నీ మాధవ స్వయంగా, సొంత ఇంటి పెళ్లిలా చూస్తున్నాడు. రాఘవ అక్కడ లేకపోయేసరికి ఏదో వెలితి అందరికీ అనిపిస్తూనే వుంది.

ఉదయం ఎనిమిది గంటలకల్లా అందరి టిఫిన్లూ పూర్తయ్యాయి.

పది గంటలకు మాంగల్యధారణ ముహూర్తం.

సరళకు అలంకరణ చేస్తున్నారు. ఆ అమ్మాయి కళ్ళల్లో నీటి తడి. తన పెళ్లికి నాన్న పక్కన లేకపోవటంతో విషాద మేఘాలు ఆ అమ్మాయి ముఖం మీద తెరలు తెరలుగా కదులుతున్నాయి. నాన్న అంటే ఆ అమ్మాయికి ఎంతో ఇష్టం.

పదేళ్ల వయసు వరకూ తనని గుండెల మీద పడుకోబెట్టుకుని జోపుచ్చిన నాన్న! తనకు చిన్న జబ్బు చేసినా ఎంతో ఆందోళనతో రాత్రులకు రాత్రులు మేల్కొనే నాన్న, తనకు అర్థంకాని సబ్జక్టులను ఎంతో ఓపిగ్గా పక్కన కూచుని బోధించే నాన్న! ఎప్పుడూ 'అమ్మా తల్లీ' అంటూ తన్ను పిలిచే నాన్న! తను స్కూలు నుంచీ రావటం పది నిమిషాలు ఆలస్యమైతే ఎంతో ఆరాటపడే నాన్న!

అలాంటి నాన్న స్పృహ లేని స్థితిలో వుండగా తన పెళ్ళి జరగటం....ఆ అమ్మాయి కళ్ల నుంచీ ఒక్కొక్క బొట్టే జారి పడుతోంది.

"వియ్యంకుల్ని అడిగి పెళ్ళిముహూర్తం వాయిదా వేయించమ్మా" అని మొన్న అమ్మతో అంటే, అమ్మ భోరున ఏడ్చేసింది. "మీ నాన్నతో ఈ మాట చెబితే ఒప్పుకోలేదమ్మా! మళ్ళీ ముహూర్తం వాయిదా అంటే ఎటు పోయి ఎటువస్తుందో! మళ్లీ ఎంతెంత ఖర్చు" అన్నాడమ్మా! ఈ శుభకార్యం జరిగిపోతే చాలు. నేను ఎదుట లేకపోతే ఏం? ఈ కార్యం ఆపడానికి వీల్లేదన్నాడమ్మా" అంటూ, అమ్మ కుమిలి కుమిలి చెబుతూంటే మౌనంగా వుండిపోయింది తను!

పెళ్లి పనుల కోసం నాన్న తిరగటాలూ, డబ్బు కోసం పడ్డ అవస్థలూ, వేళకు సరిగా తిండి లేక నెల రోజులుగా నాన్న పడ్డ శ్రమా, రోజు రోజుకూ నాన్న చిక్కిపోతూండటమూ, గుర్తుకొచ్చేకొద్దీ సరళ కళ్ల నుండి నీళ్ళు ప్రవాహమే అయ్యాయి.

ఈ రోజు ఉదయం "నాన్నకు నమస్కరించి ఆశీస్సులు తీసుకొని వస్తానమ్మా" అని అమ్మతో అంది. "వద్దమ్మా వద్దు" అంటూ గట్టిగా అరచినట్టు ఏడ్చేసింది అమ్మ. "పెళ్ళికూతుర్ని చేశాక నువ్వు మరెక్కడికీ వెళ్ళరాదమ్మా" అంటూ తన్ను గుండెల కదుముకుని కళ్లనిండా నీళ్లు కుక్కుకుంది అమ్మ! పక్కనే వున్న మాధవ బాబాయ్ తన తల నిమురుతూ "ఫరవాలేదులేమ్మా! మీ నాన్న ఏమీ అనుకోరు" అంటూ ఓదార్చాడు.

ముహూర్తం దగ్గర పడుతోంది.

పెళ్ళికుమారుని, మంగళ వాయిద్యాలతో, సంప్రదాయ బద్ధంగా కళ్యాణ వేదిక దగ్గరకు పిల్చుకొని వచ్చారు. రాఘవ హాస్పిటల్లో వున్నాడు కాబట్టి, ఆయన కుమారుడు కన్యాదానం చేయవచ్చని పురోహితుడు సెలవిచ్చాడు.

కళ్యాణ వేదిక మీదకు పెళ్ళి కుమార్తెను తీసుకువచ్చారు. వేదిక మీద ఒక మూలగా నిశ్శబ్దంగా కూచుని వుంది వరలక్ష్మి. మాధవ, వేదిక పక్కన నిల్చుని కార్యక్రమాన్ని నడిపిస్తున్నాడు.

పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు.

రాఘవ కుమారుడు మహీధర పెళ్ళికూతురు పక్కన కూచుని కన్యాదాతగా పురోహితుడు చెప్పిన పనులు చేస్తున్నాడు.

పెళ్ళికుమారుని పాదాలను వెండి తట్టలో వుంచి కడిగి పురోహితుడు చెప్పిన మంత్రాలను ఉచ్చరిస్తూ కన్యాదాన కార్యక్రమం నడిపిస్తున్నాడు.

పందిట్లో వున్న వారందరికీ అక్షింతలు పంచారు. పెళ్లి కుమారుడు మంగళసూత్రం చేత పట్టుకొని లేచి నిల్చొని మండపంలో వున్న అందరికీ నమస్కరించి, మంగళవాయిద్యాలు పెద్ద హోరులో మోగుతూండగా "మాంగల్యం తంతునానేనా..." అంటూ పురోహితుడు మంత్రాలు ఉచ్చరిస్తూండగా, పెళ్ళి కుమార్తె మెడలో మూడుముళ్లూ వేశాడు.

వరలక్ష్మి కళ్ళ నుండీ ఒక్కొక్క బొట్టే రాలుతూండగా, అక్షింతలు వేసింది. పందిట్లో నుండి చిన్న వర్షం జల్లులా అక్షింతలు వధూవరులపై కురిశాయి.

వివాహ శుభకార్యం ముగిసింది.

వెంటనే భోజన ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

వరలక్ష్మి కళ్యాణ వేదిక పక్కన ఒక స్తంభానికి చేరగిలబడి నిర్లిప్తంగా కూచుని వుంది. మాధవ ఆదరాబాదరగా హాస్పిటల్‌కి వెళ్ళాడు.

మధ్యాహ్నం పండ్రెండు దాటేసరికి భోజనాలు పూర్తయ్యాయి.

వచ్చిన అతిథులు తాంబూలాలు పుచ్చుకొని బయలుదేరుదాం అనుకుంటూండగా, హాస్పిటల్ నుంచి వచ్చి, అప్పుడే ఆటోలో దిగిన మాధవ దిగులు మొగంతో పందిట్లోకి అడుగుబెట్టి గోడోమని ఏడుస్తూ ఒక బెంచీ మీద కూలబడిపోయాడు కుప్పగా. "ఏమిటి? ఏమైంది?" అంటూ అతని చుట్టూ క్షణంలో మూగేశారు.

"రాఘవ చనిపోయాడు" అన్న మాట అతని నోటి నుండి పూర్తిగా రాకముందే పెద్ద పెట్టున హాహాకారాలూ, ఏడ్పులూ, పెడబొబ్బలూ మండపమంతా ఒక ప్రేలుడు శబ్దంలా వినిపించాయి.

ప్రవాహ వేగం భరించలేక, ఆగి ఆగి ఒక్క ఉదుటున తెగిపోయిన ఆనకట్టలా వరలక్ష్మి భోరుమంటూ విరుచుకు పడిపోయింది. ఆమె కంఠం నుంచీ వెలువడ్డ ఆర్తనాదం, ఉప్పెన హోరులా ఉవ్వెత్తున కళ్యాణ మండపాన్ని ముంచివేసింది.

"రాఘవ చనిపోయాడట... ఇప్పుడిప్పుడే చనిపోయాడట" అన్న వార్త దావానలంలా క్షణంలో అక్కడంతా మండుకొంది....

అయితే... రాఘవ అంతకు ముందు రోజు సాయంత్రం ఆరు గంటలకే ఆసుపత్రిలో మరణించిన సంగతి వరలక్ష్మికీ, మాధవకూ, ఆసుపత్రి సిబ్బంది కొందరికీ తప్ప, మరెవ్వరికీ తెలియదన్న నిజం అక్కడున్న వారెవ్వరూ పొరపాటున కూడా ఊహించలేకపోయారు....

*(ఆంధ్రజ్యోతి వారపత్రిక 14-4-95)*

★ ★ ★